అధ్వానంగా 'పేరూర్' కాల్వ

- వ్యర్థాలు, మురుగుతో నిండిన కాల్వ
- చివరి భూములకు అందని నీరు
- పూడిక తీయాలని కోరుతున్న రైతులు

హాలియా : ఎడమ కాల్వ పరిధిలోని సాగునీటి కాలవలు అధ్వానంగా మారాయి. ఎన్‌ఎస్పీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనుముల మండలంలోని పేరూర్ ఎల్‌-1 మైనర్ కాల్వ దుస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ కాల్వ పరిధిలో సుమారు 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతి ఏటా నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ద్వారా పేరూర్ మైనర్ కాల్వకు నీటిని విడుదల చేస్తున్నా ఆయకట్టు చివరి భూములకు మాత్రం నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పేరూర్ మైనర్ కాల్వ పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో నిండిపోయింది.

అధికారుల నిర్లక్ష్యంతో..

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పలు వర్తక, వ్యాపారులు, కోళ్ల ఫాం నిర్వాహకులు వ్యర్థ పదార్థాలను పేరూర్ కాల్వలో పడేస్తున్నారు. ఈ వ్యర్థాలు తూముల వద్ద నీరు ప్రవహించకుండా అడ్డుకోవడం వల్ల చివరి భూములకు నీరందే పరిస్థితి లేకుండా పోయింది. దీనికితోడు కాల్వలో పిచ్చి మొక్కలు పెరిగాయి. అదేవిధంగా ఈ కాల్వలోని నీటిని తాగి మూగ జీవాలు అస్వస్థతకు గురవుతున్నాయి. వ్యర్థాలు తొలగించడంలో ఎన్‌ఎస్పీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తూము పటిష్టంగా లేకపోవడంతో వచ్చే కొద్దిపాటి నీరంతా వృథాగా పోతోంది. కాల్వలో చెత్త వేయనీయకుండా చూడాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, కాల్వలో పేరుకుపోయిన పూడిక తీయడంతో పాటు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగిస్తే చివరి ఆయకట్టుకు నీరందే అవకాశముందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



మురుగు, కంపచెట్లతో అధ్వానంగా మారిన పేరూర్ ఎల్‌-1 మైనర్ కాల్వ



పేరూర్ కాల్వలో నిండిపోయిన చెత్తా చెదారం

పూడిక తీస్తే ఎంతో మేలు



పేరూర్ ఎల్‌-1 మైనర్ కాల్వ పూడుకపోయింది. వ్యాపారస్తులు చెత్తాచెదారం తీసుకొచ్చి కాల్వలో వేయడంతో తూముల్లో ఇరుక్కొని నీరు సక్రమంగా ప్రహించక చివరి భూములకు నీరందడం లేదు. కాల్వ కట్ట బలహీనంగా ఉండడంతో గతంలో రెండు సార్లు కాల్వకు గండ్లు పడ్డాయి. రైతులమంతా కలిసి గండ్లు పూడ్చుకున్నాం. కాల్వలో పూడికతీత పనులు చేపట్టి తూములను బాగుచేస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

– ఆవుల సైదులు యాదవ్, రైతు, మదార్‌గూడెం

కాంగ్రెస్‌కు మద్దతిస్తే ఉచిత విద్యుత్ రద్దే..

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే ఉచిత విద్యుత్ రద్దవుతుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 3 గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్ విధానంపై ప్రతి గ్రామంలో చర్చ జరగాలని, ఇదే అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు ఈనెల 17 నుంచి 27 వరకు పది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, పస్నూరి యుగేందర్‌రెడ్డి, నాయకులు టీవీఎన్.రెడ్డి, దస్రూనాయక్, లోకసాని తిరుపతయ్య, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రాజినేని వెంకటేశ్వర్‌రావు, వల్లపురెడ్డి, చింతపల్లి సుభాష్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజలు బస్తీ దవాఖానాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని 4వ వార్డులో రూ.13లక్షలతో నిర్మించిన బస్తీ దవాఖానాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి, కమిషనర్ వెంకటయ్య, ఏఈ రాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

రాములు మృతి బాధాకరం

చందంపేట: మండలంలోని గన్నెర్లపల్లి గ్రామానికి చెందిన ఏనిక రాములు మృతి బాధాకరమని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం చందంపేట మండలంలోని గన్నెర్లపల్లి గ్రామంలో రాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య, రమావత్ మోహన్‌కృష్ణ, మర్ల శ్రీశైలం, బొడ్డుపల్లి కృష్ణ, వరికుప్పల యాదయ్య, నోముల లింగమయ్య, రాములు, రాజు, శివ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



లక్పతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, భాస్కర్‌రావు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): దామరచర్ల జెడ్పీటీసీ లలిత తండ్రి ఎర్రచెరువుతండాకు చెందిన రమావత్ లక్పతి ఇటీవల మృతిచెందాడు. ఆదివారం తండాలో నిర్వహించిన లక్పతి దశదిన కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్పతి చిత్రపటానికి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్, పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మిర్యాలగూడ మార్కెట్ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డి, అనంతలక్ష్మి, బ్రహ్మారెడ్డి, సత్యనారాయణరెడ్డి, లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి నాయక్, బాబు, సత్యనారాయణరెడ్డి, సైదిరెడ్డి ఉన్నారు.

పేదలకు సాయం చేయడంలోనే నిజమైన ఆనందం



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ పాండు రంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పేదలకు సాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగార్జునపేట, జమ్మనకోట, చింతలపాలెం గ్రామాల్లో బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 మంది నిరుపేద కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం పంపిణీ చేసి మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఈ కార్యక్రమాలు నిత్యం కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు వస్తపురి మంగమ్మరామలింగయ్య, పమ్మి జనార్దన్‌రెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, బాసిరెడ్డి కుమారి వెంకట్‌రెడ్డి, రమావత్ కనికి, ప్రభావతి సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచులు మునినాయక్, ప్రదీప్‌రెడ్డి, జలీల్‌పాషా, నాయకులు నర్సింహ, కృష్ణారెడ్డి, ప్రసాద్, మట్టారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నూనె వెంకటేశ్వర్లు

డిండి: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డిండి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు లింగమయ్య, లక్ష్మయ్య, జంగాచారి, అలివేలు, రోజమ్మ, జంగమ్మ, రసూల్‌బేగం, ఇద్దమ్మ పాల్గొన్నారు.

రేషన్‌లో కల్తీ బియ్యం

కొండమల్లేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందించే రేషన్‌లో కల్తీ బియ్యం వచ్చాయి. ఈ సంఘటన ఆదివారం కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మమ్మ శనివారం డీలర్ వద్ద 36 కేజీల రేషన్ బియ్యం తెచ్చింది. వీటిని నీటిలో కడిగి నానబెట్టడంతో అందులో కొన్ని బియ్యం గింజలు బొంగులుగా మారి నీటిపై తేలాయి. కల్తీ బియ్యమని గుర్తించి సదరు డీలర్ వద్దకు వెళ్లి ఈ బియ్యం వాపస్ తీసుకోవాలని కోరగా.. డీలర్ నిరాకరించాడు. నాణ్యమైన రేషన్ బియ్యం ఇవ్వాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బీజేపీని ఆదరించాలి



కేంద్ర పథకాలను వివరిస్తున్న నాయకులు

త్రిపురారం: బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ మండల నాయకుడు పానుగోటి హరీష్ కోరారు. ఆదివారం మండలంలోని అంజనపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమర్దపు నర్సింహ, కొప్పు సోమయ్య, ఉర్దండు రామకృష్ణ, మెరుగు మహేష్, వల్లపుదాసు హుస్సేన్, చెదరుపల్లి శ్రీనివాస్, పద్మ, రాముచ మహేష్, నాగరాజు, కుంచం గిరి, శివ, బ్రహ్మతేజ, తిరుమలేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు

హాలియా: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాదం సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం అలీనగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాదం సంపత్ కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ యడవెల్లి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, జానీ, ఆంజాద్‌ఖాన్, శ్రీరాములు యాకూబ్, సర్వర్, చిరంజీవి, కొండల్, మారుతి, నవీన్, జావేద్‌ఖాన్, హబీబ్, సాయి, సైదులు తదితరులున్నారు.



బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న యడవెల్లి విజయేందర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికే 'మన ఊరు– మన ఎమ్మెల్యే'

- ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే హోదాలో అన్ని శాఖల అధికారులను తీసుకొని మీ గ్రామానికి వచ్చామని సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. ఆదివారం త్రిపురారం మండలంలోని కాపువారిగూడెం తండా, లచ్య తండా, పలుగు తండా, కుంకుడు చెట్టు తండా, రాగడప గ్రామ పంచాయతీల పరిధిలోని తండాల్లో ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ బీఆర్‌ఎస్ మండల నాయకులతో కలిసి మన ఊరు– మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకూ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు తండాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడంలేదని, మురుగు కాలువలు తీయడం లేదని, పోడు భూముల పట్టాలు అనర్హులకు ఇచ్చారని ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. అనంతరం రెండు నూతన గ్రామ పంచాయతీ భవనాలకు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్, త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు మాద ధనలక్ష్మి, కామర్ల జానయ్య, యూత్ అధ్యక్షుడు రవి కుమార్ నాయక్, నాగా నాయక్, జిల్లా నాయకులు కామర్ల జానయ్య, బైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్, నగిరి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ నాగరాజు, అవిరెండ్ల సైదులు, చంద్ర మోహన్ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాపువారిగూడెంలో గ్రామ సమస్యలను ఎమ్మెల్యే భగత్‌కు వివరిస్తున్న గ్రామస్తుడు

కార్యకర్తల్లో సమన్వయం పెంచేందుకే 'లంచ్'



దుబ్బతండాలో నిర్వహించిన లంచ్ బాక్స్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: ప్రజలకు సేవలు మరింత చేరువ చేసేలా ప్రోత్సహించడంతో పాటు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేందుకు బీజేపీ లంచ్ బాక్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని గూడూరు క్యాంప్ ఎక్స్‌రోడ్డు దుబ్బతండాలోని రాధాకృష్ణ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ లంచ్ బాక్స్ కార్యక్రమంలో పార్టీ పరివార చర్చలు నిర్వహించారు. అందరూ కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ 9 ఏళ్ల పాలనలో పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొండేటి సరిత, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు సీతారాంరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు దొండపాటి వెంకట్‌రెడ్డి, పులి విద్యాసాగర్, నాయకులు తదితరులున్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

డిండి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ అన్నారు. ఆ పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డిండి మండల పరిధిలోని కె.గౌరారం స్టేజీ వద్ద ఆదివారం బీజేపీ లంచ్ బాక్స్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ, మండల అధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, వెంకటయ్య, సాగర్, మోహన్, అంజి, రాములు, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మాడుగులపల్లి: మండలంలోని అర్హులైన రైతులంతా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సైదానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లను జత చేసి మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో లేదా వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులకు ఆగస్టు 5 వరకు గడువు ఉందని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు

దేవరకొండ: దేవరకొండ పట్టణానికి చెందిన నల్ల విజయ్ దంపతుల కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విజయ్ కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30వేలను వారికి ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, సాయిచంద్ర, రిషి, పూర్ణచందర్, అంజి, వంశీ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



నియోజకవర్గస్థాయి ఆత్మీయ ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడుతున్న బీఎల్‌ఆర్

- కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్

మిర్యాలగూడ: రానున్న ఎన్నికల్లో మిర్యాలగూడలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ ఆదేశాల ప్రకారం సర్వేల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిర్ణయిస్తారని, అందరూ దీనికి కట్టుబడి ఉండి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 90 రోజుల కార్యాచరణ రూపొందించామన్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్ సమాచారంతో కూడిన గడియారాన్ని ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు, నిరుద్యోగులు, ప్రజలు అన్యాయానికి గురయ్యారని, రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, అర్జున్, సర్పంచ్ అంజిరెడ్డి, ఎంపీటీసీ ఇబ్రాయిల్, కౌన్సిలర్లు రావుల ఎల్లారెడ్డి, పాతూరి ప్రసాద్, నాగలక్ష్మి, మహబూబ్ అలీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల భిక్షాటన



పెద్దవూరలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



అడవిదేవులపల్లిలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

అడవిదేవులపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పంచాయతీ కార్మికులు అడవిదేవులపల్లి మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుర్ర సక్రు, ఉపాధ్యక్షులు సుశీల, ప్రధాన కార్యదర్శి ధనావత్ కస్వర్‌లాల్, కోశాధికారి బంగారమ్మ, కార్యదర్శి దేశోజు యల్లాచారి, సహాయ కార్యదర్శి సైదులు, విజయ, వాసు, సైదయ్య, పున్నయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మాడుగులపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికుల సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. మాడుగులపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం కొనసాగింది. వారు మాట్లాడుతూ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, ఈఎస్‌ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

పెద్దవూర: తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దవూరలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు మంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ను, జీఓ 51ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఊరె ప్రభాకర్, నాయకులు రమావత్ శ్రీను, పాల్తీ రాజారావు, కృష్ణ, వెంకటయ్య, యాదమ్మ, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని వినాయకనగర్ కాలనీలో నివాసముంటున్న ఆర్టీసీ ఉద్యోగి పగిళ్ల బుచ్చిబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపీపీ రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి కందుల వెంకట్‌రెడ్డి, వరికుప్పల శ్రీనివాస్ పాండు, పగిళ్ల యాదయ్య తదితరులున్నారు.

రాబోయే ఎన్నికల్లో ఎరుకల ఓట్లే కీలకం



మాట్లాడుతున్న వజ్జగిరి అంజయ్య

మిర్యాలగూడ టౌన్: రాబోయే ఎన్నికల్లో ఎరుకల ఓట్లే కీలకం కానున్నాయని, జనాభా ప్రాతిపదికన ఎరుకలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో జరిగిన సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారన్నారు. ఎరుకల ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలుగుతామని తెలిపారు. నాటి నుంచి నేటి వరకూ ఎరుకలను అగ్రవర్ణాల వారు అణగతొక్కుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఎరుకల వాటాల ప్రకారం అసెంబ్లీ టికెట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పోల నాగయ్య, కందేల పెద్ద సుంకయ్య, వజగిరి వెంకన్న, పోల వెంకటేశ్వర్లు, చిన మారయ్య, వజ్జగిరి వెంకన్న తదితరులున్నారు.

క్రీడాపోటీలు సామరస్యంగా నిర్వహించుకోవాలి

త్రిపురారం: గ్రామాల్లో యువత క్రీడాపోటీలను సామరస్యంగా నిర్వహించుకోవాలని సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం త్రిపురారం మండల కేంద్రంలో గ్రామ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జానయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

హాలియా: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్ కుమార్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలో ప్రజాప్రస్థాన పరిచయ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆయన పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి, శివాజీ విగ్రహాలతో పాటు, తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏకే ఫౌండేషన్ ద్వారా 12 ఏళ్లుగా సాగర్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకే ఫౌండేషన్ సభ్యులు, యువకులు తదితరులున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రోడ్డుపై ఏర్పడిన గుంత

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి– హాలియా ప్రధాన రోడ్డుపై నీరు వెళ్తుండడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులకు, పాదచారులు ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గుంత ఏర్పడిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



అడవిదేవులపల్లి- హాలియా రోడ్డులో ఏర్పడిన గుంత

సాగర్‌లో బోనాల పండుగ

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని హిల్ కాలనీ, పైలాన్‌కాలనీలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఉదయం నుంచే హిల్‌కాలనీలో ముత్యాలమ్మ ఆలయం వద్ద, పైలాన్‌కాలనీలో పోచమ్మ ఆలయం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ముడుపులు చెల్లించుకున్నారు. సాయంత్రం మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. కాగా.. బోనాల పండుగను పురస్కరించుకుని నాగార్జునసాగర్ ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.



బోనాలు ఎత్తుకుని పైలాన్‌కాలనీలోని పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు